ప్రజాశక్తి

బుధవారం 22 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఫార్మాలో భయం.. భయం

◆ మెట్రో కెమ్‌లో అగ్ని ప్రమాదంతో భీతిల్లిన ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు

◆ విచారణకు కలెక్టర్ ఆదేశం

ఎగిసి పడుతున్న మంటలు, దట్టమైన పొగ

ప్రజాశక్తి - పరవాడ, అనకాపల్లి విలేకరులు

పరవాడ ఫార్మా సిటీలోని మెట్రో కెమ్ ఎపిఐ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ - 4లో మంగళవారం ఉదయం సుమారు 6:40 గంటల సమయంలో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంతో మళ్లీ ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. పెద్ద పెద్ద అగ్నికీలలు, దట్టమైన పొగ ఆ ప్రాంతమంతటా ఆవరించడంతో కంపెనీ చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల్లోని కార్మికులు, చుట్టుపక్కల గ్రామాలైన తానాం, తాడి వాసులు భీతిల్లారు. తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండటం పట్ల వారు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. గత నవంబర్‌లో ఇదే మిగతా 2లో..

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

మెట్రో కెమ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావులు డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లవారు కంపెనీ ఇటిపి ప్లాంట్‌లో ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు అక్కడకు చేరుకున్నారు. కంపెనీలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా మిగతా 2లో..

మెట్రో కెమ్‌లో ప్రమాద స్థలాన్ని చూపుతున్న లోకనాథం

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి శంకబ్రత బాగ్చి

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టయింది. ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు విశాఖ సిపి డాక్టర్ శంకబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు. కొన్ని విషయాలను పబ్లిక్‌గా చెప్పలేమని, పెద్ద తలకాయలు ఉన్నాయని అన్నారు. అందరినీ కచ్చితంగా పట్టుకుంటామన్నారు. క్రికెట్ బెట్టింగ్ ముఠాతో సంబంధం ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేశామని, విచారణ జరుగుతోందని తెలిపారు. ముఠాతో సంబంధాలు ఉన్న వారి 80 బ్యాంకు ఖాతాలను, రూ.45 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. ఆ అకౌంట్స్ ద్వారా రూ.176 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించామన్నారు. రానున్న ఐపిఎల్ సీజన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆన్‌లైన్ ముఠాలను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. విశాఖ నగర ప్రజలే తమకు ఇన్ఫార్మర్లని, తన ఫోన్ నెంబరు అందరి దగ్గరా ఉందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన సమాచారంతోనే క్రికెట్ బెట్టింగ్ ముఠాలోని తొమ్మిది మందిని అరెస్టు చేశామని వెల్లడించారు.

వంగలి రైతులకు ఎమ్మెల్యే పంచకర్ల క్షమాపణ

▸ వార్త 6లో..

చిరస్మరణీయుడు లెనిన్

▸ వార్త 5లో..

విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనుల పరిశీలన

▸ వార్త 2లో..

సంక్రాంతి ప్రత్యేక బస్సులతో..

ఆర్‌టిసికి రూ.2 కోట్ల ఆదాయం

మీడియాతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి సందర్భంగా ఎపిఎస్ ఆర్‌టిసి విశాఖపట్నం ప్రత్యేక బస్సులను నడపగా రూ.2 కోట్లు ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి అదనపు ఛార్జీలూ లేకుండానే బస్సులను నడిపామన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి ద్వారకా బస్ స్టేషన్ నుండి సంక్రాంతి స్పెషల్ బస్సు సర్వీసులను పండగకు ముందు సుమారు 1100, ఆ తరువాత 300 ప్రయాణికుల సౌకర్యార్థం తిప్పామన్నారు. విజయనగరం జోన్‌లో సుమారు 2000 సర్వీసులను ద్వారకా బస్ స్టేషన్ నుంచి నడిపామని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుండి రైళ్లలో వచ్చిన వారిని ద్వారకా బస్ స్టేషన్ నుంచి వారి ప్రాంతాలకు పంపించామన్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి సహా పలు దూర ప్రాంతాలకు సర్వీసులు నడిపామన్నారు.

సంక్రాంతి తర్వాత ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విశాఖ జిల్లా నుంచి సుమారు 300 ట్రిప్పులు, విజయనగరం జోన్ నుంచి 700 ట్రిప్పులు వివిధ ప్రాంతాలకు తిప్పామన్నారు. గత సంవత్సరం కంటే 35 శాతం అదనంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చామన్నారు. సహకరించిన ప్రయాణికులు, అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ

అధికారులు, ప్రజలకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నో అనర్థాలకు దారితీసే ప్లాస్టిక్ వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని, విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజలు పరస్పర సహకారంతో మెలగాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం, ఇతర కార్యాచరణపై జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, డిసిపి అజిత, ఇతర అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారి వల్ల కలిగే దుష్ప్రయోజనాలను గుర్తించాలని, దానికి దూరంగా ఉంటే కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు పాటించాల్సిన పద్ధతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 45 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, పెద్దపెద్ద షాపింగ్ మిగతా 2లో..

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మొదటి పేజీ తరువాయి..

ఫార్మాలో భయం.. భయం

కంపెనీలో ప్రమాదం జరిగింది. మూడు నెలలు గడవక ముందే మరలా మంగళవారం అగ్ని ప్రమాదం జరగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీ భద్రతా చర్యల అంశం తెరపైకి వచ్చింది.

అసలేం జరిగింది ?

మెట్రో కెమ్ యూనిట్ - 4లో ఇటిపి ట్యాంకులు మూడో అంతస్తులో ఉన్నాయి. రెండు, మూడు రోజులు అక్కడే వేస్ట్ కెమికల్‌ను స్టాక్ చేశారు. వాటిపై సాల్వెంట్ పడటంతో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చారు. విషయం తెలియడంతో రాంకీ అగ్నిమాపక సిబ్బంది కూడా రంగంలోకి దిగింది. ఈ ప్రమాదం వల్ల ఎటువంటి ప్రాణనష్టమూ జరగనప్పటికీ ఫార్మా కంపెనీల్లో లోపభూయిష్టతను తాజా ఘటన ఎత్తిచూపింది. ఘటనా స్థలాన్ని పరవాడ డిఎస్‌పి వి.విష్ణు స్వరూప్, సిఐ మల్లికార్జునరావు సందర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. సంఘటనపై విచారణకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు ప్రమాద ఘటనపై దర్యాప్తు అనంతరం నివేదిక సమర్పించనున్నట్లు జిల్లా పరిశ్రమలు జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

ప్రమాణాలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతోందని, లాభాలే పరమావధిగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి తప్ప కార్మికుల ప్రాణాలను పట్టించుకోవడం లేదని అన్నారు. నవంబర్‌లో ఇదే పరిశ్రమలో ప్రమాదం జరిగిందని, అప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకొని వుంటే ఈ ప్రమాదం సంభవించేది కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాసీనంగా వుండడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ కమిటీలు ఇచ్చిన నివేదికలను బహిర్గతం చేసి, ప్రమాదాలకు కారణమైన కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇప్పుడు చిన్న చిన్న ఫార్మా కంపెనీల్లోనే ప్రమాదాలు అరికట్టలేని ప్రభుత్వాలు నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పేరుతో వచ్చే పెద్ద పెద్ద పరిశ్రమల్లో ప్రమాదాలను ఏ విధంగా అరికట్టగలవని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రమాదాలకు కారణమైన కంపెనీపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భద్రత డొల్ల : సిఐటియు

మెట్రో కెమ్‌లో ప్రమాదంతో ఫార్మా కంపెనీల్లో భద్రతా డొల్ల మరోసారి బహిర్గతమైందని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు అన్నారు. భద్రతా ప్రమాణాలను పాటించని సదరు కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 2న ఇదే పరిశ్రమలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వందలాది కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని, లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని చెబుతున్నారని, కార్మికులకు భద్రత పాటించని యాజమాన్యాలపై ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలపై ముఖ్యమంత్రి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. పరిశ్రమలు రావడం ఎంత ముఖ్యమో, కార్మికుల ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ఇప్పటికైనా ప్రమాద కారక పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, జి.దేముడు నాయుడు పాల్గొన్నారు. తాజా ఘటనపై విచారణ చేపట్టాలని ఎఐటియుసి నాయకులు రాజాన దొరబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ

కాంప్లెక్సులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, మద్యం దుకాణాలు, పర్యాటక ప్రాంతాలు తదితర చోట్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని, సంబంధిత సర్క్యులర్లను కింది స్థాయి కార్యాలయాలకు పంపించాలని జిల్లా స్థాయి అధికారులకు తెలిపారు. ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా అంకిత భావంతో అందరూ వ్యవహరించాలని సూచించారు. ఆటోలు, బస్సుల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ డెయిరీ ఉత్పత్తుల ద్వారా విక్రయించే కవర్లను వినియోగదార్ల నుంచి మళ్లీ తిరిగి సేకరించాలని డెయిరీ అధికారులకు చెప్పారు. అవగాహన ద్వారా మార్పు తెచ్చేందుకు ప్రయత్నం చేయాలని, అప్పటికీ మార్పు రాకపోతే జరిమానాలు వేయాలని, కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జివిఎంసి సిఎంఒ సురేష్, జోనల్ కమిషనర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిజెపి జిల్లా అధ్యక్షునిగా పరశురామరాజు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిజెపి ఉత్తరాంధ్ర ప్రాంత ఇన్‌ఛార్జిగా ఉన్న మంతెన మురళీ నాగ పరశు రామరాజు తాజాగా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ విషయాన్ని పార్టీ జిల్లా తాజా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షుని నియామక కార్యక్రమం మంగళవారం లాసన్స్ బే కాలనీలోని నగర బిజెపి కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు హాజరయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి పరశురామరాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై వైసిపి తీవ్ర నిర్లక్ష్యం

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో పల్లా శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్యాకేజీ వచ్చేలా చేసి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడామని, గత వైసిపి ప్రభుత్వం ప్లాంట్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి స్టీల్‌ప్లాంట్ వల్ల సాధ్యమవుతుందన్నారు. గత వైసిపి పాలనలో కేవలం భూ దోపిడీ కోసం మాత్రమే స్టీల్‌ప్లాంట్ వ్యవహారం నడిపారని ఆరోపించారు. దేశంలో గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో నిలవనుందని తెలిపారు. అనకాపల్లిలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ కోసం ఆర్సెలార్ మిట్టల్‌తో సిఎం చంద్రబాబు దావోస్‌లో ఎంఒయు చేసుకున్నారన్నారు. ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం విశాఖలో భూములు కొట్టేసిందన్నారు. దసపల్లా, వాల్తేరు క్లబ్ భూములు కూడా కొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. విశాఖకు త్వరలో టిసిఎస్, గూగుల్ సంస్థలు వస్తున్నాయని చెప్పారు. పోలవరం పనులు ఇక వేగంగా జరుగుతాయన్నారు. ఏటా పది వేల క్యూసెక్కుల నీళ్ల అందించే పనులు జరుగుతున్నాయని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చంద్రబాబు పునరుత్తేజం తెచ్చారని అన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను జగన్ అమ్మేశారన్నారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, రాష్ట్ర రోడ్లు భవనాలు ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్

విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని జోన్ల వారీగా క్షేత్ర స్థాయిలో సమీక్షించి సంబంధిత కార్యనిర్వాహక ఇంజినీర్లు పనులను నిర్దిష్ట కాల పరిమితికి లోబడి గుత్తేదారులు పూర్తి చేసేలా బాధ్యత తీసుకోవాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మంగళవారం ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించి ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇంజినీర్లకు అంతస్తుల వారీగా బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్ బలరామరాజు, ఉప సహాయక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌పై వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిపిఎఫ్ఒ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం హయ్యర్ పెన్షన్ కేసుల ప్రాసెస్‌ను వేగవంతం చేయాలంటూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్‌రావు, జిల్లా అధ్యక్షులు దీనబంధు, ఎపిసిసి సభ్యులు కుమార్ మంగళం, జిల్లా కమిటీ సభ్యులు నారాయణరావు ఆర్‌పిఎఫ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రికవరీ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2024 డిసెంబర్ రికవరీ మేళాను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ గత నెలలో 116 కేసులు నమోదయ్యాయని, వాటిలో 67 కేసులను విజయవంతంగా ఛేదించామని తెలిపారు. 91 మందిని అరెస్టు చేశామన్నారు. చోరీ కాబడిన సొత్తులో రూ.43,28,226 విలువగల వస్తువులు, నగదు, రూ.47,25,000 విలువగల 315 మొబైల్ ఫోన్లు వెరసి రూ.90,53,226 విలువగల సొత్తును రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన వస్తువులను రికవరీ మేళా ద్వారా బాధితులకు అందజేస్తామన్నారు.

డిసెంబర్‌లో రికవరీ చేసుకున్న సొత్తులో 1012.85 గ్రాముల బంగారం, 2478 గ్రాముల వెండి, రూ.12,07,660 నగదు, 10 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 315 ఫోన్లు, 100 మీటర్ల కాపర్ వైర్ ఉన్నాయన్నారు.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.258/2023

Between:
Sri Sunkari Adinarayana ...Plaintiff
And:
Sri Bangarala Sudhakar ...Defendant

SUMMONS

To, The Defendant:
Sri Bangarala Sudhakar,
S/o. B. Nagaraju, Hindu, aged 33 years, R/at D.No.44-46/4/C, Srinivasa Nagar, Akkayyapalem, Visakhapatnam-16
Permanent Resident of Meraka Meeda Colony, Ramayogi Agraharam, Bheemunipatnam, Visakhapatnam District-531063.

Please take notice that above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount with subsequent interest and costs, other reliefs on the strength of a promissory note and the suit stands posted to **03-02-2025** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **03-02-2025** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
D. ANANDA SWAROOP, G.L.N.S. SANKARA BEHARA,
Advocates
Visakhapatnam, Cell: 9392340345

మహారాజశ్రీ అనకాపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో.
EP 39/2020 IN OS 119/2017

బిట్వీన్:
భోగవిల్లి శ్రీనివాసరావు ...DHR
అండ్:
ది రిలయన్స్ ఇన్ఫ్రాటల్ లిమిటెడ్ & వగైరాలు ...JDRS

వేలం ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా షెడ్యూల్ దాఖల స్థిరాస్తిలో ఈ క్రింది తెలిపిన చరాస్తులను శ్రీ కోర్టు వారు **11-2-2025వ తేదీని** వేలం వేయుటకు నిర్ణయించారు. కావున ఆరోజు **ఉదయం 10:30 నిమిషములకు** పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: అనకాపల్లి టౌన్, వార్డు నెంబర్-12. న్యూ కాలనీ, డోర్ నెంబర్ 12-5-20.గల స్థిరాస్తికి హద్దులు. **తూర్పు:** 30 అడుగుల రోడ్డు. **దక్షిణం:** రుత్తలఅమ్మాజీ ఆస్తి. **పడమర** : వాది యొక్క మిగతా ఆస్తి. **ఉత్తరం** : వాది యొక్క మిగతా ఆస్తి అవతల రోడ్డు. పై స్థిరాస్థిలో గల చరాస్తుల వివరములు

	అమీనా విలువ	DHR విలువ
సెల్ టవర్	రూ.1,00,000/-	రూ.1,00,000/-
పాతజనరేటర్	రూ.5,000/-	
పాత షెడ్డు	రూ.5,000/-	
ఐరన్ గేటు, మెష్	రూ.10,000/-	

వి.ఎస్.ఎస్.ఆర్.బి. శ్రీనివాస్
అడ్వకేట్, అనకాపల్లి
సెల్: 9440332949

చిరస్మరణీయంగా శత వసంతాల వేడుక

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకలు చిరస్మరణీయంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వేడుకల నిర్వహణ కమిటీ ప్రతినిధులను కోరారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌తో కలిసి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వేడుకల విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల అధికారులు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు, ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు హాజరైన ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, ఈ తరహా శత వసంతాలు జరుపుకునే పాఠశాలలు అరుదుగా ఉంటాయని, పండగ వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వేడుకలు నిర్వహించాలన్న కమిటీ ప్రతినిధుల అభిప్రాయం మేరకు ఈ పది రోజుల వ్యవధిలో పాఠశాలకు పెయింటింగ్ వేయాలని సూచించారు. ఇందుకు పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయండి : కలెక్టర్

విద్యా శాఖ, సమగ్ర శిక్ష, ఇంజినీరింగ్ ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, వేడుకల నిర్వహణ కమిటీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని పనిచేస్తే పాఠశాల శత వసంతాల వేడుకలు విజయవంతం అవుతాయని కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జివిఎంసి, విఎంఆర్‌డిఎ అధికారులు కూడా సహకారం అందించాలని స్పష్టం చేశారు. ప్రణాళికా బద్ధంగా నిర్వహణకు పూర్తి స్థాయిలో కసరత్తు చేయాలని వేడుకల నిర్వహణ కమిటీ ప్రతినిధులకు సూచించారు. ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసి కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, వేడుకల నిర్వహణ కమిటీ చైర్మన్ జిఅప్పలనాయుడు, డిఇఒ ప్రేమ్‌కుమార్, తహశీల్దార్ పి.రామారావు, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, సమగ్ర శిక్ష డిఇఇ డివి.నరసింహారావు, ఎంఇఒలు 1,2 ఎం.శివరాణి, జయప్రద పాల్గొన్నారు. అనంతరం లోగోను ఆవిష్కరించారు.

పాఠశాల శత వసంతాల వేడుక లోగోను ఆవిష్కరిస్తున్న గంటా, కలెక్టర్

కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న వెలుగు కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన మండల స్థాయి కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ, కౌమారదశ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మానవ జీవితంలో అత్యంత కీలకమైనది ఈ దశ అని చెప్పారు. ఇది ఒక ప్రయోగశాల దశ అని, వయోజన మానసిక ధోరణలు దిశగా వికాసం చెందే దశ అని తెలిపారు. బాలల హక్కులకు బాలల సంరక్షణకు మధ్య భేదం, యువజన హక్కులు, విద్యా నైపుణ్యాల అభివృద్ధికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శ్రీదేవి, ఎఒ జయ ఉమ, స్వప్న, డేవిడ్ రాజు, ఉమా జానకి, రాజ్యలక్ష్మి, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

పెంటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పెంట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పద్మనాభం మండల వ్యవసాయాధికారి బివి.చలం ఆధ్వర్యాన నిర్వహించారు. భీమిలి వ్యవసాయ శాఖ ఎడిఎ బి.విజయప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు పలు పంటలపై అవగాహన కల్పించారు. నువ్వు పంట యాజమాన్య పద్ధతులు, రాగి సాగులో మెలకువలు, వేరుశనగ, మినప, ఇతర పంటలపై అవగాహన కల్పించారు. రబీ సాగులో తప్పనిసరిగా పంట నమోదు కార్యక్రమం చేసుకోవాలని కోరారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్,
వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

కైలాసగిరి అభివృద్ధికి ప్రాధాన్యత

విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రణవ్‌గోపాల్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖలో పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిని మరింత అభివృద్ధి చెందేలా పలు కీలక ప్రాజెక్టులు తీసుకొచ్చేందుకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. కైలాసగిరి కొండపై ఉన్న వ్యాపారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపార కార్యకలాపాల కోసం విఎంఆర్‌డిఎ నిర్దేశించిన స్థలం కంటే ఎక్కువ అకమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యాటకులతో మర్యాద పూర్వకంగా ఉండాలని, వారిని ఇబ్బంది పెడితే లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలు వసూలు చేయవద్దన్నారు. అవసరాన్ని బట్టి సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రానున్న రోజుల్లో కైలాసగిరిపై అనేక కొత్త ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు తెలిపారు. పర్యాటకులు వస్తేనే వ్యాపారాలు సాగుతాయనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కొండపై సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విఎంఆర్‌డిఎకు వచ్చే ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగం, ఫిర్యాదులపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యుత్ వినియోగం, ఫిర్యాదులపై అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ శాఖ సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో విద్యుత్ వినియోగం ఫిర్యాదులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక జీవన విధానంలో విద్యుత్తు ఎంతో ప్రధాన పాత్ర పోషిస్తోందని, అద్భుతమైన ఈ విద్యుత్ శక్తిని సమర్ధవంతంగా, పొదుపుగా ఎలా వినియోగించుకోవాలనే విషయంపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కళాశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెంబర్ అకౌంట్స్ షేక్ బాబర్, మెంబెర్ టెక్నికల్ మాసిల మణి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ పి.శ్రీనివాసరావు, ఎమ్.ధర్మరాజు, మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, సిఎంఒ డాక్టర్ పి.సుబ్బరాజు, డాక్టర్ ఆర్ఎస్ఆర్.కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆనందపురం మండలంలోని పలువురు సర్పంచులు కోరారు. ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనందపురం, పద్మనాభం మండలాల సర్పంచులు, కార్యదర్శులు హాజరయ్యారు. ఆనందపురం మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీలో జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం లేక రెండేళ్ల నుంచి నిర్మాణాలు చేపట్టలేదని, పంచాయతీ పరిధిలో ఉన్న శ్మశాన వాటికలకు విద్యుత్ లైన్లు ఏర్పాటుచేయాలని, లో వోల్టేజ్ సమస్య ఉందని, వీటిని పరిష్కరించాలని సర్పంచ్ కోన పైడిరాజు శ్రీను వినతిపత్రం అందజేశారు. చందక పంచాయతీ పరిధిలో లో-వోల్టేజ్ సమస్య ఉందని, సుమారు 24 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచాలని, పొలాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చందక సర్పంచ్ బంక శ్రీను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జగ్గరాజుపాలెం కేబుల్ సమస్య,ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ సిజిఆర్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసిలమని, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యులు ఎన్.మురళీకృష్ణ, జోన్ -3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు డిప్యూటీ ఇంజినీర్ రాజశేఖర్, ఎఇ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోటు షికారు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జమ్మి చెరువులో బోటు షికారు ఏర్పాటుచేయాలని కోరుతూ జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చెరువు చుట్టూ ఇప్పటికే వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఉన్నాయని, వీటికి తోడు బోటు షికారు ఏర్పాటుచేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలో అయ్యన్న కాలనీకి చెందిన ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయ్యన్న కాలనీకి చెందిన వర్రే వర్షిత (19) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతుంది. ఈ విద్యార్థిని సోమవారం రాత్రి ఇంట్లోనే చున్నితో ఉరివేసుకొని చనిపోయిందని సిఐ గోవిందరావు తెలిపారు. సోమవారం రాత్రి గదిలోకి వెళ్లిన విద్యార్థిని తలుపులు గెడ వేసుకుందని ఎంతకీ బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి డోర్లు తెరిచారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం టౌన్ పోలీస్ స్టేషన్ లో తండ్రి నరసింగరావు ఫిర్యాదు చేసినట్లు సీఐ గోవిందరావు తెలిపారు. క్లూస్ టీం, డాగ్స్ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నామని గోవిందరావు పేర్కొన్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ నాయుడు తమ సిబ్బందితో కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామ శివార్లలో నాటుసారాం విక్రయాలు జరుగుతున్నట్టుగా సమాచారం మేరకు దాడులు చేశారు. బత్తిన లక్ష్మి అనే మహిళ నుండి 10 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకొని, నిందితురాలిని అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మనాయుడు తెలిపారు. కోర్టు 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.. ఈ దాడులలో అనకాపల్లి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కె ఎస్.గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

లడక్, కార్గిల్ రైతులకు గీతం టెక్నాలజీ

ప్రజాశక్తి -మధురవాడ: ఏడాది పొడవునా చల్లటి వాతావరణంతో ఉండే లడక్, కార్గిల్ ప్రాంతాలలో ఉద్యాన వన పంటలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచడానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) నిపుణులు అభివృద్ధి చేశారు. రైతులు ఉపయోగించేలా హైబ్రీడ్ సోలార్ డయర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని లడాక్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్‌కె.మెహతకు జి-టెక్ కో-ఆర్డినేటర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు ఇటీవల జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

జి-టెక్‌కు చెందిన నిపుణులు డాక్టర్ కెవివిఎన్ఆర్.చంద్రమౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జి-టెక్ అధికారి సోంబట్ శాస్త్రీ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారు. తక్కువ వ్యయంతో అయ్యే ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఉష్ణోగ్రతలను నియంత్రించే సెన్సార్‌లు, పగటి పూట సూర్య రశ్మిని గ్రహించి సౌరశక్తిని నిల్వచేసి రాత్రి సమయంలోను తగు ఉష్ణోగ్రతల మధ్య పంటలను సంరక్షించే పరిజ్ఞానం ఉపయోగించినట్లు వారు తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఆహార ఉత్పత్తుల రంగు, రుచి, వాసనలలో ఏవిధమైన మార్పులు ఉండవని పేర్కొన్నారు. దీంతో లడాక్, కార్గిల్ ప్రాంతాలలో అధికంగా పండే ఆప్రికాట్ ఇతర పండ్లను తేమ లేకుండా పొడి బారేటట్లు చేసి దీర్ఘకాలం నిల్వ చేసుకోవచ్చని వారు వెల్లడించారు.

లడాక్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్‌కె.మెహత మాట్లాడుతూ, సరైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేక లడాక్ ప్రాంత రైతులు పంట దిగుబడిలో 60 శాతం వరకు కోల్పోతున్నారని పేర్కొన్నారు. గీతం నిపుణులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం దిగుబడి అయిన పంటలలో తేమ వల్ల జరిగే నష్టాలను నివారించి నాణ్యతతో కూడిన ఎగుమతులకు మార్గం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలోని పరిశోధన ఫలితాలు క్షేత్ర స్థాయిలో ఈ విధంగా ఉపయోగపడటం అభినందనీయమన్నారు. జి-టెక్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ, ఇటీవల మిజోరాం రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం టిటిఐ డివిజన్ శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్, అకాడమి ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చి శాస్త్రవేత్త డాక్టర్ సంజయ్ కుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం టెక్నాలజి ఎనేబిలింగ్ సెంటర్ నిపుణులు డాక్టర్ జి.ఎస్.ప్రసాద్, ప్రొఫెర్ ఎస్.రాజగోపాల్, డాక్టర్ బి.సునీల్, గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ అధిపతి వికాశ్‌కుమార్ శ్రీవాత్సవ, జి-టెక్ అసిస్టెంట్ మేనేజర్ అలేఖ్య మారం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గాజువాక : పారిశుధ్య కార్మిక సమస్యలు పరిష్కరించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గొలగాని అప్పారావు డిమాండ్‌చేశారు. జివిఎంసి 75వ వార్డు పరిధి నడుపూరు హైస్కూల్, తుపాన్ బిల్డింగ్ గ్రౌండ్‌లో పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొలగాని అప్పారావు మాట్లాడుతూ, పెండింగ్ లోకల్ శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముఖ్యముగా పనిముట్లు, సేఫ్టీ పరికరాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 2024 డిసెంబర్ నెల మిస్సయిన కార్మికుల జీతాలు రాలేదని, ఇన్‌కం ట్యాక్స్ సొమ్ము సంపూర్ణంగా గాజువాక కార్మికులకు చెల్లించలేదని, క్యాజువల్ లీవ్ రికార్డుల నిర్వహణ చేయటం లేదని పేర్కొన్నారు. డైలీ వేజ్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. 2022 సంవత్సరం నుంచి నేటి వరకు మిస్సయిన కాంట్రాక్టు /అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, బకాయి హెల్త్ అలవెన్స్ రాలేదని తెలిపారు. గాజువాక, షీలా నగర్, పోర్టు రోడ్డు క్లీనింగ్ కార్మికులకు బ్యాంకు ద్వారా బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ లేని వారికి వెంటనే అమలుచేయాలని కోరారు. ఈ సమావేశంలో కె.సూరిబాబు, ఎం.లక్ష్మి, గొల్ల అప్పారావు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న గొలగాని అప్పారావు

ఆకాష్ ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : అకడమిక్స్‌లో అన్ని విధాలా తర్ఫీదు పొందే రీతిలో ఆకాష్ ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఆకాష్ విద్యాసంస్థల స్టేట్ అకాడమిక్ హెడ్ జెఆర్‌విఎస్‌ఎన్.మూర్తి, రీజనల్ సేల్స్ గ్రోత్ హెడ్ నిశాంత్ మిశ్రా తెలిపారు. సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని గత ఏడాది ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ అంతర్జాతీయ ఒలంపియాడ్లలో ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. నీట్, జేఈఈ, ఎన్‌టిఎస్‌ఇ, ఒలంపియాడ్లలో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. 315 కేంద్రాల ద్వారా దేశవ్యాప్తంగా ఏడాదికి నాలుగు లక్షల మంది విద్యార్థులు ఈ 36 సంవత్సరాలలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ పిఆర్ హెడ్ వరుణ్ సోనీ, అసిస్టెంట్ డైరెక్టర్ వై.లక్ష్మీనారాయణ, బ్రాంచ్ మేనేజర్ జి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఇబి, ఐఒక్యుఎం, ఐఎంఒ, ఎన్ఎస్ఇ సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్ట్ ఒలంపియాడ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా జ్ఞాపికలతో సత్కరించారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

ప్రజాశక్తి-వేపగుంట : బాల్య వివాహాల నివారణకు ఐక్యంగా కృషిచేయాలని సిడిపిఒ నీలవేణి కోరారు. జివిఎంసి 95వ వార్డు పరిధి వేపగుంటలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ నీలవేణి మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించేందుకు కొన్ని టీములను ఏర్పాటుచేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమలత, జూనియర్ కళాశాల లెక్చరర్ శ్రీదేవి, ఎస్ఐ రాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మానస, గీత, లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-పెందుర్తి : ట్రాఫిక్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని వెస్ట్ ట్రాఫిక్ సిఐ జి.శ్రీనివాసరావు సూచించారు. వేపగుంట హైస్కూల్ నుంచి కూడలి వరకు విద్యార్థులతో ట్రాఫిక్ భద్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతివేగంతో వాహనాలను నడపవద్దన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని వివరించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది శ్రీనివాసరావు, జోగినాయుడు, కృష్ణారావు, హెచ్ఎం ఎం.ఉమామహేశ్వర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 నుంచి గీతంలో ఎక్సలెన్స్ మీట్

ప్రజాశక్తి -మధురవాడ : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ మూడు రోజుల పాటు నిర్వహించే గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్)- 2025ను ఈ నెల 29, 30, 31 తేదీలలో నిర్వహిస్తున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు తెలిపారు. మంగళవారం జెమ్-2025 ఆహ్వాన కమిటీతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో జెమ్ వివరాలను వెల్లడించారు. జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా "జెమ్"ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తూ వస్తున్నామని, ఎందరో విద్యార్థుల ప్రతిభకు వేదికగా జెమ్ నిలిచిందని చెప్పారు. ఈ ఏడాది "సామర్థ్య" పేరిట నిర్వహిస్తున్న జెమ్-25 యువజనోత్సవాన్ని "భవిష్య యువతను నాయకత్వ లక్షణాలతో బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశంగా వివిధ కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ వనరుల ప్రాధాన్యతను, సంస్థల నిర్వహణలో హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ల ప్రాధాన్యతను తెలిపేలా 29వ తేదీన చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్స్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 30, 31 తేదీలలో విద్యార్థులకు వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు, సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జెమ్-25 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.మిశ్ర మాట్లాడుతూ, విద్యార్థుల్లో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను వెలికి తీసే విధంగా వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెమ్-25 కో కిఆఒ కె.చైత్ర హెడ్స్ మాట్లాడుతూ, క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతులను, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విద్యార్థుల ఆధ్వర్యాన ఫ్యాషన్‌షో, రాక్‌బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలియజేశారు.

స్టీల్ రిటైర్మెంట్ ఉద్యోగుల..

మెడికల్ ఇన్సూరెన్స్‌లో మార్పులు తగవు

ప్రజాశక్తి -ఉక్కునగరం : ఉద్యోగ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ జిఎంఎస్, పిఆర్‌ఎంఎస్ స్కీముల్లో చేస్తున్న మార్పులను రిటైర్డ్ ఉద్యోగులు ఖండించారు. అగనంపూడి సిడబ్ల్యుసిలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రిటైర్మెంట్ ఉద్యోగులకు విఘాతం కలిగించే మార్పు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మెడికల్ ఇన్సూరెన్స్ విధానంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి ఏటా రూ.1300, భార్యకి రూ.1300 మొత్తం 2600 చెల్లిస్తే రూ.ఆరు లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నారని తెలిపారు. బయట కొనుక్కొనే మందులకు రూ.16 వేలు ఇస్తున్నారని వివరించారు. కొత్త విధానం ప్రతిపాదనలో భార్యాభర్తలు కలిపి రూ.20 వేలు మెడికల్ ఇన్సూరెన్స్ కట్టాలని, బయట కొనుక్కొనే మందులకు తిరిగి చెల్లింపు నిమిత్తం మనిషికి రూ.4 వేలు చొప్పున భార్యాభర్తలకు రూ.8 వేలు ఇవ్వాలని ప్రతిపాదన చేశారని తెలిపారు. వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న సమయంలో ఇటువంటి చర్యలకు స్టీల్ సిఎండి శరత్ కుమార్ సక్సేనా ప్రతిపాదనలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రిటైర్మెంట్ ఉద్యోగులకు విఘాతం కలిగించే ప్రతిపాదనలు విరమించుకొని పాత పద్ధతిలోనే ఆర్ఐఎన్ఎల్ గ్రూపు మెడికల్ స్కీము కొనసాగించాలని కోరారు. దీనిపై అఖిలపక్ష యూనియన్లు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ యాజమాన్యంపై ఒత్తిడి చేయాలని కోరారు. గుదె సుశీల గజేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయిన సన్యాసిరావు (ఏఐటియుసి), మరిసా రామచంద్రరావు (ఐఎన్‌టియుసి), వై.ఎర్రయ్య (సిఐటియు), స్టీల్ మాజీ ఉద్యోగులు విందుల వరహాలు, కొలిపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వనమాలి పద్మనాభరావు మృతి

ప్రజాశక్తి-పెందుర్తి : హిందుస్థాన్ షిప్ యార్డ్ మాజీ ఉద్యోగి వనమాలి పద్మనాభరావు గుండెపోటుతో జివిఎంసి 97వ పరిధి చినముషిడివాడలో మంగళవారం ఉదయం మృతి చెందారు. హిందుస్థాన్ షిప్‌యార్డులో ఉద్యోగం చేసినప్పుడు సిఐటియు, సిపిఎంలో చురుకైన పాత్ర పోషించారు. ఇటీవల పెందుర్తిలో జరిగిన సిపిఎం విశాఖ మహాసభలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన సతీమణి సిపిఎం సభ్యులుగా ఉన్నారు. 50 వార్డు కార్పొరేటర్‌గా సిపిఎం నుంచి ఆమె పోటీ చేశారు. ఆయన మృతిపట్ల షిప్‌యార్డు ఉద్యోగులతో పాటు సిఐటియు, సిపిఎం నాయకులు సంతాపం తెలిపారు.

ఎయులో జపనీస్ డిప్లమో

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం జపనీస్ భాషలో డిప్లమా కోర్సు కోసం ప్రవేశాలను ప్రారంభించింది. ఆసక్తిగల విద్యార్థులు, ప్రజలు ఆంధ్ర విశ్వవిద్యాలయం అడ్మిషన్ల డైరెక్టర్ లేదా ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రెండవ అంతస్తులోని విదేశీ భాషల విభాగాన్ని (9014088901) సంప్రదించాలని విదేశీ భాషల విభాగాధిపతి, జపాన్ సమాచార, అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ సూచించారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయని, ఆరునెలల కోర్సును సాయంకాలం తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎపి బిసిఎల్ గొడౌన్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు

గోదాముల పరిశీలనకు వెళ్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని జెర్రిపోతులపాలెం గ్రామంలో ఉన్న ఎపి బిసిఎల్ గోదామును ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం పరిశీలించారు. గోదాములోని స్టిక్కర్ కంపెనీని, గోదామును పరిశీలించారు. వస్తున్న స్టాకు, జరుగుతున్న పంపిణీ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 29వ తేదీ నుంచి నవోదయం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. కల్తీ లేని మద్యం అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. తక్కువ ధరకే మద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బెల్టు షాపుల నివారణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎక్కడైనా అనధికారంగా నాటు సారా తయారుచేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, సర్పంచ్ మడక అప్పలరాజు, మాజీ వైస్ ఎంపిపి మడక పార్వతి, జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు, సోమశేఖర్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జెర్రిపోతుల పాలెం వచ్చిన మంత్రి కొల్లు రవీంద్రకు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై భీమిలి ఎస్ఐ జి.హరీష్ అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కష్టంతో పాటు ఇష్టపడి చదవాలని విద్యార్థులకు చెప్పారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం టిఎస్‌వి.ప్రసాదరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఎంసి ఛైర్మన్ బి.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు మురళీధర్, వి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ప్రభావతి, మహిళా పోలీస్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి -తగరపువలస : భూసారం స్థితి గతులు ఎలా ఉన్నాయి, మట్టిలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో పంటలు పండేందుకు వీలుగా ఉన్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు భూసార పరీక్షలు తప్పనిసరి అని రైతు శిక్షణా కేంద్రం ఎడిఎ జి.హరికృష్ణ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా ఎంపిక చేసిన భీమిలి మండలం, లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం క్షేత్ర స్థాయిలో మండల స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులతో కలిసి విద్యార్థుల భాగస్వామ్యంతో అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను సంచార భూసార పరీక్షా విభాగం సంచాలకులు టి దాసు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం ఎఒ సురేష్, భీమిలి ఎఒ బి.శివకోమలి, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎల్.హరీష్, బి.రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రపంచ విప్లవాలకు బాటలు వేసిన చిరస్మరణీయుడు లెనిన్

- దోపిడీ నుండి విముక్తికి సోషలిజమే మార్గం
- లెనిన్ శత వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

1917లో రష్యాలో సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేసి, ప్రపంచంలో అనేక దేశాల్లో విప్లవాలు జయప్రదం కావటానికి బాటలు వేసిన వి.ఐ.లెనిన్ చిరస్మరణీయుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పేర్కొన్నారు. ప్రథమ సోషలిస్టు దేశ వ్యవస్థాపకులు విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ అధ్యక్షతన సభ జరిగింది. ముందుగా లెనిన్ చిత్ర పటానికి లోకనాథం పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని మానవాళి విముక్తి కోసం ఉపయోగించిన మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ అని తెలిపారు. కేవలం 54 సంవత్సరాలు మాత్రమే జీవించి, ప్రపంచ పీడిత ప్రజల జీవితాల బాగు కోసం పోరాడిన మహనేత అని కొనియాడారు. కష్టాలు, కన్నీళ్లు, ఆకలి, దారిద్ర్యం లేని సోషలిస్టు వ్యవస్థ సాధన కోసం కృషి చేసి సాధించిన గొప్ప ఆచరణవాది లెనిన్ అని పేర్కొన్నారు. అమానుషమైన పెట్టుబడిదారీ దోపిడీకి విరుగుడు సోషలిజమేనని ఆయన ఆచరణలో రుజువు చేశారన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ దశలో ప్రజల సంపద కార్పొరేట్ పాలవుతున్న నేటి తరుణంలో లెనిన్ ఆవశ్యకత మరింత పెరిగిందన్నారు. యువత బంగారు భవిష్యత్తుకు, భారతదేశ అభ్యున్నతికి లెనిన్ ఆచరణాత్మక సిద్ధాంతం మార్గదర్శకం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, నాగిరెడ్డి సత్యనారాయణ, జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆకలి, పేదరికం, మతం, జాతి, వర్గ అసమానతలు లేని దోపిడీ రహిత సోషలిస్టు విప్లవాన్ని రష్యాలో సాధించిన వి.ఐ.లెనిన్ మహాశయుడు ప్రపంచానికే గొప్ప నాయకుడని సిపిఐ రాష్ట్ర నాయకులు చలసాని రాఘవేంద్రరావు అన్నారు. మంగళవారం సిపిఐ విశాఖ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన లెనిన్ 101వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులందరూ నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పనిచేసినప్పుడు మాత్రమే లెనిన్‌కు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జిఎస్‌జె.అచ్యుతరావు, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మధరావు, సిఎన్.క్షేత్రపాల్ పాల్గొన్నారు.

హరిదాసులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్న హరిదాసులు నేడు కడు పేదరికంతో బతుకుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని బిఎస్‌పి అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు విజ్ఞప్తి చేశారు. గతంలో వందల సంఖ్యలో హరిదాసులుగా జీవించిన వారు ప్రస్తుతం అరుదుగా మాత్రమే కనిపిస్తున్నారని, త్వరలో ఈ వృత్తిలో ఉన్నవారు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హరిదాసులను బీసీ ఏ నుండి ఎస్టీలోకి మార్పు చేసి వారికి ప్రభుత్వం నుండి అదనపు ప్రయోజనాలు కలిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

లారీ నుంచి కింద పడ్డ బండరాయి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలో నిరంతరం 50 నుంచి 60 టన్నుల లోడుతో భారీ లారీల ద్వారా క్వారీల నుంచి రాయి రవాణా అవుతోంది. ఈ లారీల్లో పరిమితికి మించి లోడు చేస్తుండడంతో పలుమార్లు లారీల నుంచి రాతి బండలు జారీ పడుతున్నాయి. మార్టూరు నుంచి అనకాపల్లి వెళ్లే పెద్ద లారీ నుంచి సుమారు 50 కిలోల బరువు ఉండే రాయి తుమ్మపాల మెయిన్ సెంటర్‌లో మంగళవారం జారి పడింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ రాయిని స్థానిక యువతులు రోడ్డు నుంచి పక్కకు తొలగించారు. పరిమితికి మించిన లోడుతో రవాణా అవుతున్న ఇటు మైనింగ్ అధికారులు, అటు రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టానుసారంగా రాత్రి పగలు తేడా లేకుండా వందల లారీలు కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీవో, మైనింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్యాలకు మించి ఇళ్ల నిర్మాణాలు

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో లక్ష్యాలకు మించి ఇళ్లు నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో గృహనిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని, ఇందుకు లబ్దిదారులకు అవసరమైన సహకారాన్ని అందించాలని సూచించారు. లక్ష్యాలను పూర్తిచేయుటకు ప్రణాళిక తయారు చేసుకోవాలని, ప్రతి వారానికి స్టేజి వారీగా పురోగతి వచ్చేలా పనులు చేపట్టాలని కోరారు. అర్హులైన గృహనిర్మాణదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. లే అవుట్‌లలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, దానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్దిదారులకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు వై.శ్రీనివాస్, మండల ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ 100 పని దినాలు కల్పించాలి

అనకాపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ వంద పని దినాలు కల్పించాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులపై డ్వామా, హౌసింగు, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నిధులతో చేపట్టిన పల్లెపండుగ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణం చేసుకొనే లబ్దిదారులకు 90 రోజులు పనిదినాలు కల్పించాలని సూచించారు. రోడ్లు, ఫారం పాండ్స్, ఇంకుడు గుంతలు, పట్టుపరిశ్రమ షెడ్లు, గోకులం షెడ్లు, పల్లెవనాలు, అంకుడు కర్ర పెంపకం, వ్యవసాయ అనుబంధ పనులు లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు ఆర్.పూర్ణిమాదేవి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కెవి.నాయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామమోహనరావు, హౌసింగు ప్రాజెక్టు డైరెక్టరు వై.శ్రీనివాస్, ఎపిఒలు, ఎపిడిలు పాల్గొన్నారు.

మంజూరైన పనులు వెంటనే పూర్తి చేయాలి

అనకాపల్లి : పంచాయతీరాజ్ శాఖకు మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల వారీగా మంజూరైన పనులు, పూర్తయిన పనులు, వాటికి సంబంధించి బిల్లులు సమర్పణ, పెండింగు పనులు, బిల్లులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పూర్తయిన పనులకు బిల్లులను పేమెంటు కొరకు వెంటనే సమర్పించాలని కోరారు. పల్లెపండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారం నాటికి పనులన్నింటిని పూర్తిచేసి, బిల్లులు అప్లోడ్ చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం మంజూరైన రోడ్లు, కల్వర్టులు, కాలువలు వంటి పనులు పూర్తి చేసిన తరువాతే కొత్తపనులకు ప్రతిపాదనలు పంపించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కెవి.నాయుడు, డివిజనల్ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవం

అనకాపల్లి : జాతీయ స్ఫూర్తి ప్రస్ఫుటించేలా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో 76వ గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధిత శాఖల సమన్వయంతో సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రధాన వేదిక ఏర్పాట్లు ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్ఫూర్తి, సమగ్రత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌పి తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, ఆర్‌డిఒలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, ఎఎస్పి దేవప్రసాద్, సిపిఒ జి.రామారావు, కలెక్టరేట్ ఎఒ బి.వి.రాణి పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లుపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా, జెసి తదితరులు

రిమాండ్ ఖైదీలకు సహాయం అందించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : బెయిలు తెచ్చుకోలేని స్థితిలో జైళ్లలో మగ్గుతున్న రిమాండ్ ఖైదీలకు అండగా నిలిచి బెయిల్ వచ్చేదాకా వారికి సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత పానల్ లాయర్లపై ఉందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ సాధికార సంస్థ చైర్మన్ పి.విజయతో కలిసి మంగళవారం శేషమ్మ సబ్ జైలును సందర్శించి 10 మంది రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. లాయర్లు పెట్టుకోలేని స్థోమతలేని ఖైదీలు ఎవరైన ఉంటే చెప్పాలని ఆమె కోరారు. లాయర్లు లేనివారికి తమ న్యాయసేవ సాధికార సంస్థ పానెల్ లాయర్లు సహాయ పడతారని తెలిపారు. యలమంచిలి జైలు పానెల్ లాయర్లుగా పి.వి.రమణ, టి.నూకరాజు, హరిశంకరరావు ఉన్నారని తెలిపారు. రిమాండ్ ఖైదీలు తమకు ఇబ్బందులు ఎదురైనపుడు కంప్లైంట్ బాక్స్‌లో రాసి వేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎం.ప్రసాద్, జైలు వార్డర్స్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - యలమంచిలి : పరవాడ డిఎస్‌పిగా రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన వల్లెం విష్ణుస్వరూప్ మంగళవారం యలమంచిలి రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ముఖ్యమైన కూడళ్లలో కలయ తిరిగారు. ట్రాఫిక్, షాపులు, రద్దీ ప్రాంతాలు, రోడ్డు పక్క షాపులు, ఆటో పార్కింగ్ స్థలాలు మొదలైన వాటిని అవగాహన కోసం పరిశీలించారు. బస్టాండ్ వద్ద రైల్వే స్టేషన్ రోడ్డు ప్రయాణికులు, విద్యార్థుల రద్దీని అడిగి తెలుసుకున్నారు. రద్దీ ప్రాంతాల సమస్య పరిష్కారానికి చేయాల్సిన పనుల గురించి స్థానిక పోలీసు అధికార్లతో చర్చించినట్లు తెలిసింది. డిఎస్‌పి వెంట సిఐ జనార్దన్, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, టౌన్ ఎస్ఐ సావిత్రి ఉన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గవరపేట సీతారాముల తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సీతారాముల వారికి భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలను గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం మహిళల చిడతలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాత్రి సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెంటకోట గణేష్, శరగడం భూలోక నాయుడు, అప్పలనాయుడు, అచ్చంనాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరుకావాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజలకు సేవలు అందించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలో గల దిబ్బిడి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్ఓ సత్తిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అశోక్, ఎఎన్ఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఒల సంఘం డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అనకాపల్లి జిల్లాకు చెందిన డైరీని, క్యాలెండర్‌ను మంగళవారం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శశిధర్, సింహాచలం నాయుడు, వెంకట్రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : గవరపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా కిట్ క్యాట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డాన్స్ బేబీ డాన్స్ నిర్వహిస్తున్నట్టు సభ్యులు బుద్ధ రాజేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద కిట్ క్యాట్ వారి ఆధ్వర్యంలో జరగబోయే డాన్స్ బేబీ డాన్స్‌ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిట్ క్యాట్ సభ్యులు పీలా హరి, పెంటకోట గణేష్, పెంటకోట సంతోష్, దాడి కృష్ణ, కొణతాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవం

విజయ్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఇత్తడి కంచాల పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక గౌరీ పరమేశ్వరుల దేవస్థానంలో ఎలమంచిలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్ దంపతులు సోమవారం రాత్రి భక్తులకు ఇత్తడి కంచాలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా భక్తులకు కానుకలు అందించడం పరిపాటిగా వస్తుందని, ఈ ఏడాది 350 మంది భక్తులకు కంచాలు పంపిణీ చేశామని విజయ్ తెలిపారు. అనంతరం దంపతులు ఇరువురిని దేవస్థానం కమిటీ ఛైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, గౌరవ అధ్యక్షులు పెంటకోట శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆడారి సూరిబాబు, కర్రి సూరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-వడ్డాది : ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బుచ్చయ్యపేట ఎంపిడిఓ వి.విజయలక్ష్మి అన్నారు. బుచ్చయ్యపేట మండలం లోపూడి సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని, మార్పులు, చేర్పులు, శిశు ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెహనజ్ బేగం, ఏఎన్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

సర్పంచ్ గున్నయ్యనాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఉగ్గినిపాలెం గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఎంపిటీ కలగా లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇబి.నాయుడు, ఒమ్మి గంగునాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ పిఇటి శ్రీనివాస్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కశింకోట : ఇంటర్నేషనల్ ఖోఖో టెక్నికల్ ఆఫిషియల్‌లో ఎంపికైన కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాల పిఇటి సిహెచ్ఎల్ఎన్.శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు. ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఖోఖో టెక్నికల్ ఆఫీసర్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుండి ఇద్దరు పిఇటిలు ఎంపిక కాగా, వారిలో శ్రీనివాస్ ఒకరు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్ యాజమాన్యం శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించింది. స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం తీరం పర్యాటకంగా అభివృద్ధి

ప్రజాశక్తి-పరవాడ : ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం.రమేష్ లోక్‌సభలో 377 నిబంధన కింద చర్చించిన నేపథ్యంలో సంబంధిత శాఖ పరిశీలన నిమిత్తం పంపించినట్లు తెలియజేస్తూ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అనకాపల్లి ఎంపికి లేఖ రాశారు. ఈ మేరకు ఈ లేఖ సారాంశాన్ని ఎంపీ తెలియజేశారు. 'స్వదేశ్ దర్శన్' కింద ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన్ని అభివృద్ధి చేస్తామని షెకావత్ లేఖలో పేర్కొన్నట్లు చెప్పారు. ఈ మేరకు కేంద్ర మంత్రి షెకావత్‌కు, ఎంపీ రమేష్‌కు ముత్యాలమ్మపాలెం పంచాయతీ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మోస రామకృష్ణ తెలిపారు.

సీతారామరాజు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విశ్రాంత ఉపాధ్యాయుడు పివి సీతారామరాజు చేసిన సేవలు మరువలేనివని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. మండలంలోని మల్లవర గ్రామంలో ఇటీవల మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పివి సీతారామరాజు సంతాప కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ రఘువర్మ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు బి.వెంకటపతిరాజు, సిహెచ్.దుర్గాప్రసాద్, విశ్రాంత ఎంఇఒ శిష్టా తమ్మిరాజు, బొద్దపు కాశీ విశ్వేశ్వరరావు, వైసిపి జిల్లా నాయకులు పిన్నమరాజు రవీంద్ర, గ్రామ సర్పంచ్ పి.వాసురాజు, కెవి.రమణ, బి.శ్రీనివాసరావు, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

వంగలి రైతులకు ఎమ్మెల్యే పంచకర్ల క్షమాపణ

- ఐఎంయు అధికారులతో చర్చలు సఫలం
- నిరాహార దీక్షలు విరమించిన నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని వంగలి వద్ద ఉన్న ఇండియన్ మారిటైం యూనివర్సిటీ (ఐఎంయు) భూ సేకరణ సమయంలో తాము ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వంగలి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పారు. తమ సమస్యలపై ఐఎంయు నిర్వాసిత వంగలి రైతులు నాలుగు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో నాలుగో రోజు మంగళవారం దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సందర్శించారు. రైతులు, ఐఎంయు అధికారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ తాను 2010లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వంగలిలో ఐఎంయు కోసం భూ సమీకరణ జరిగిందని తెలిపారు. నాటి జాయింట్ కలెక్టర్ గిరిజా శంకర్, తాను రైతులకు చెక్కులు పంపిణీ చేసినప్పుడు ఎకరాకు రూ.50వేలు పెంచాలని కోరిన పిమ్మట తాను హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. నాడు తాము ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంపై రైతులు తనను మన్నించాలని కోరారు. ఆ నాడు వంగలి గ్రామ పెద్దలు, ప్రజలు తన మాటపై నమ్మకం ఉంచి భూములు ఇవ్వడం వల్లే నేడు యూనివర్సిటీ వంగలిలో ఏర్పాటైందని తెలిపారు. నాలుగు రోజులుగా భూ నిర్వాసితులు రిలే దీక్షలు చేపట్టడంతో ఐఎంయు అధికారులు తనను కలిశారని, అలాగే తమకు న్యాయం చేయాలని నిర్వాసిత రైతులు కూడా పలుమార్లు తనను కలిసి అభ్యర్థించారని చెప్పారు. ఐఎంయు అధికారులతో చర్చలు జరిపాక రైతుల 12 డిమాండ్లలో 10 డిమాండ్లు అమలు చేసేందుకు ఐఎంయు అధికారులను ఒప్పించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి రూ.3 కోట్లు ఇవ్వాలన్న ప్రతిపాదనను నెరవేర్చకపోయినా, ఐఎంయు అధికారులు కొంత మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తే, మిగతా గ్రాంటును తాను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఎకరాకు రూ.50వేలు పెంపుదలపై గతంలో ఇచ్చిన హామీ గురించి తాను ప్రస్తుత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

యూనివర్సిటీ డైరెక్టర్ వికె కేశవ దేవ్ మాట్లాడుతూ వంగలి రైతులకు ఐఎంయులో ఔట్ సోర్సింగ్ పనులు, హౌస్ కీపింగ్, గార్డెనింగ్, సెక్యూరిటీ, క్యాంటీన్, మెయింటెనెన్స్, ఆఫీస్ అటెండర్స్ ఇవ్వడానికి, యూనివర్సిటీలో అవసరమైన ట్రాక్టర్లు, కార్లు, జెసిబి, మిషనరీ వర్క్స్ రైతులకు ఇప్పించేందుకు 15 రోజుల్లోగా ఐఎంయు ఉన్నతాధికారులకు ప్రతిపాదన పెట్టి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిర్వాసిత రైతులు రిలే నిరాహార దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమంలో ఐఎంయు ఎఒ సాయిచరణ్, స్థానిక సర్పంచ్ ఆకుల శ్రీహమ గణేష్, తహశీల్దార్ బి.చిన్నకృష్ణ, సిఐ పిన్నింటి రమణ, కూటమి నేతలు ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, బంటికొళ్ళ పద్మ, కిల్లి వెంకట సత్యనారాయణ, గొర్లి కుమార స్వామి, ఎ.బంగారయ్య, వంగలి రైతులు పాల్గొన్నారు.

చేతులు జోడించి క్షమాపణ కోరుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ట్రాక్టర్, గడ్డి, ధాన్యం అగ్నికి ఆహుతి

రూ. 7 లక్షలకు పైగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం పి.భీమవరం పరిధి వాకోడు చెరువు పొలాల్లో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకొని గడ్డితో ఉన్న ట్రాక్టర్, పక్కనే ఉన్న వరి ధాన్యం కాలిపోయాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నేతవానిపాలెం గ్రామానికి చెందిన బయ్యావరపు అప్పారావు, బయ్యావరపు సంతోషి, బయ్యావరపు కొండలరావులకు చెందిన సుమారు రెండున్నర ఎకరాల పొలంలో పండిన వరి పంటను కుప్పలుగా పెట్టుకున్నారు. వరి పంటను మంగళవారం యంత్రం ద్వారా నూర్పిన అనంతరం వరి గడ్డిని వియ్యపు కొండలరావుకు ట్రాక్టర్‌పై కూలీలు కడుతున్నారు. ఈ సమయంలో వరి నూర్పిడి యంత్రం నుండి అగ్ని రవ్వలు ఎగసి గడ్డిపై పడటంతో మంటలు చెలరేగాయి. దీంతో కూలీలు ట్రాక్టర్ పైనుండి కిందకు పరుగులు తీశారు. మంటలు అధికంగా వ్యాపించి ట్రాక్టర్ తొట్టి, దానిపై గడ్డి పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు చెలరేగి ట్రాక్టర్ ఇంజనుకు అంటుకోవడంతో పెద్ద టైర్లు సైతం కాలిపోయాయి. పక్కనే ఉన్న రైతులకు చెందిన రెండున్నర ఎకరాలోల పండిన ధాన్యం కాలిపోయాయి. సమాచారం అందుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది అగ్ని మాపక శకటంతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. ఆస్తి నష్టం ఏడు లక్షల రూపాయలకు పైగా ఉంటుందని బాధిత రైతులు, ట్రాక్టర్ డ్రైవర్ కొండలరావు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న గడ్డి, ట్రాక్టర్

12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధరణకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 12వ పిఆర్‌సి కమిషన్‌ను తక్షణమే పునరుద్ధరించాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సంఘం ప్రతినిధి బృందంతో కలిసి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని, 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

అనకాపల్లి : పిఆర్‌సి అమలు, ఆర్థిక బకాయిల విడుదల తదితర అంశాలపై యుటిఎఫ్ జిల్లా నాయకులు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి వైవిఎస్‌బిజిఎస్ఎల్. సత్యనారాయణరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ 11వ పిఆర్‌సి కాలపరిమితి 2023 జూన్‌తో పూర్తయిందని, ఇప్పుడు కొత్త పిఆర్‌సి అమలు చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. తక్షణమే 12వ పిఆర్‌సి కమిషన్‌ను పునరుద్ధరించాలని, ఈ లోగా 39శాతం మధ్యంతర భృతి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిల చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజు నాయుడు, మున్సిపల్ ఉపాధ్యాయ నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా ఈనెల 23న గురువారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కొణతాల నాగేష్, డాక్టర్ కొణతాల జగదీష్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ సంతోష్ అప్పారావు నాయుడు తెలిపారు. గవరపాలెం గౌరీ పరమేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనుభవం కలిగిన వైద్యులతో మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 10 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనరల్ మెడిసిన్, ఊపిరితిత్తుల వైద్యం, ఎముకలు కీళ్ల వైద్యనిపుణులు, ప్రసూతి సంబంధిత వైద్యం, పిల్లల వైద్యం, సంతాన సాఫల్య వైద్యం, ఫైబ్రోస్కాన్, ఆడవారి స్కానింగ్, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు అనంతరం ఉచిత మందులు పంపిణీ చేస్తామన్నారు. సర్వికల్ వ్యాక్సినేషన్ రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తామని చెప్పారు. కీర్తిశేషులు కొణతాల లక్ష్మీనారాయణ సూర్యకళ జ్ఞాపకార్థం జరిగే ఈ మెడికల్ క్యాంపును అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొణతాల మురళీకృష్ణ, పీవీ రమణ, కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా ఆరోగ్య పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య బృందంతో మండలంలోని ఎన్టీఆర్ భరోసా ఆరోగ్య పెన్షన్ల తనిఖీ చేపడుతున్నట్లు ఎంపిడిఓ డి సీతారామరాజు తెలిపారు. పెన్షన్ల తనిఖీ చేపట్టేందుకు గాను రెండు వైద్య బృందాలు మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. నెలకు రూ.15వేలు పెన్షన్ పొందుతూ మంచానికి, వీల్‌చైర్లకు పరిమితమైన లబ్ధిదారులను తనిఖీ చేపట్టారు. చిన దొడ్డిగల్లు, బోదిగల్లం, నక్కపల్లి, కాగిత, ఉపమాక, రాజయ్యపేట, గుల్లిపాడు, బంగారమ్మపేట, పెదతీనార్ల పంచాయతీ గ్రామాల్లో 39 మంది ఆరోగ్య పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులను వైద్య బృందం పరిశీలించారు. వారి వద్ద నుండి వివరాలు సేకరించారు. పెన్షన్ పొందేందుకు అర్హులా, అనర్హులా అని పరిశీలన చేశారు.

సబ్బవరం : మండలంలోని వికలాంగుల మెడికల్ పింఛన్లను తనిఖీలు చేసినట్లు ఎంపిడిఓ పి.పద్మజ తెలిపారు. మండలంలోని 14 మంది వికలాంగ మెడికల్ పింఛనుదారులు ఉన్నారని, ప్రభుత్వ డాక్టర్ల బృందం పంచాయతీ కార్యదర్శులు, స్థానిక పిహెచ్‌సి వైద్యులతో కలిసి ఈ పింఛన్లను వెరిఫికేషన్లు చేసినట్లు చెప్పారు. సబ్బవరం పంచాయతీలో రెండు, ఆరిపాకలో 3, బంగారమ్మపాలెంలో 3, అసకపల్లిలో ఒకటి, గుల్లేపల్లిలో ఒకటి, మల్లునాయుడుపాలెంలో ఒకటి, మొగలిపురంలో 3 మెడికల్ పింఛన్ల వెరిఫికేషన్ జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్సి వైద్యులు డాక్టర్ ఆశ, కెజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంజీర, అగనంపూడి పిహెచ్‌సి డాక్టర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
బుధవారం 22 జనవరి 2025

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

చీడికాడ మండలం జైతవరంలో పరీక్షిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి-రోలుగుంట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రోలుగుంట మండలం బుచ్చంపేట పశువైద్యాధికారి డాక్టర్ బాలమౌనిక కోరారు. మంగళవారం బుచ్చంపేట గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు, దూడ పెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. 50 గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉలబాల రాము, సిబ్బంది భవానీ, రమణ, దివ్య, సాయికృష్ణ, శివ, యశోద, నానాజీ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని రావణాపల్లిలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి లోకుల రమేశ్ గ్రామంలోని మేకలు, గొర్రెలకు పాముల మందు, ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లి సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ మండలం కసిమి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణదేవిపేట పశువైద్యాధికారి శిరీష నట్టల నివారణ మందులు వేశారు. ఎదకురాని పశువులకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాము, బాబుమోహన్, మహేశ్, పాడి రైతులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని జైతవరం గ్రామంలో పశు వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచి కోడూరు సత్యవతి, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారిణి రాఘవమ్మ, పంచాయతీ కార్యదర్శి కొల్లి నవీన్ కుమార్ ఉప సర్పంచ్ చైతన్య, ఎంపీటీసీ ముత్యాల నాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ పాతరపల్లి సంతోష్ కుమార్, పశు సంవర్ధక శాఖ సహాయకులు మోర్తా శ్రీనివాసరావు, గుడివాడ రమేష్, చుక్కా రమేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం:మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ జగదీష్ ఆధ్వర్యాన 80 పశువులకు, 40 కోళ్లకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 10 పశువులకు గర్భకోస వ్యాధులకు, 8 ఎదకు రాని పశువులకు చూడి పరీక్షలు చేశారు. 16 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి పీల తులసి రాము, గ్రామ సర్పంచ్ పి.నర్సింగరావు, పాల సంఘం అధ్యక్షులు, పాడి రైతులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తేగాడ, తీడ గ్రామల్లో రైతు సేవా కేంద్రం వద్ద పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్స జార్జ్, కన్నూరుపాలెం పశు వైద్య అధికారి డయానా ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుంపాల మంగతాయారు, టిడిపి కూటమి నాయకులు అద్దిపల్లి బాబురావు, చందక అప్పారావు, గొర్లి నాగేశ్వరరావు, కొవ్వాడ తాతాజీ, సర్వసిద్ధి తాతారావు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, పరవాడ రవి, పంచాయతీ సెక్రటరీ ఎ.దిలీప్ కుమార్, తీడలో సర్పంచ్ చిరికి సన్యాసినాయడు, ఎంపిటిసి దుంగల నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు, గేదలు, గొర్రెలు, సుమారు 128 కోళ్లకు పాములు మందు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, పశు సంవర్ధక శాఖ ఏడి రవిచంద్ర, డాక్టర్ రాము, వెటర్నీ అసిస్టెంట్ అప్పలరాజు, నాగమయ్య పాల్గొన్నారు.

తగరపువలసలో...

తగరపువలస : భీమిలి పశు వైద్యశాల ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో పశు సంవర్ధక శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ బి.వెంకటరమణ , సిబ్బంది సహకారంతో 48 పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. పాడి రైతులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఎ శ్రీనివాసరావు, అటెండర్ వెంకటరావు, సిబ్బంది రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 273 గేదెలు, 180 ఆవులకు నట్టల నివారణ మందులు అందించారు. పశు వులు, గొర్రెలు మేకలు కోళ్లకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు ఎల్.కన్నయ్యనాయుడు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, గిడిజాల గ్రామ సర్పంచి షినగం అప్పలరాజు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యచంద్ర

పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నర్సీపట్నం కృష్ణాపేలస్‌లో జనసైనికులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. టీడీపీ శ్రేణులతో కలిసి మెలసి ఉండి స్నేహపూర్వక వాతావరణం కలిగేలా ఉండాలన్నారు.. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, కార్యవర్గ సభ్యులు అల్లాడ సురేశ్, నమ్మి రమణరాజు, ఎస్సీసెల్ అధ్యక్షులు కోవా వారాయణరావు, వాసం వెంకటేష్ పాల్గొన్నారు.

చెట్టును తొలగిస్తున్న ఎస్ఐ

భారీ వృక్షం తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట పంచాయతీ గవిరంపేట సెంటర్ వద్ద ఆర్అండ్బి రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు గత కొంత కాలంగా పడి ఉంది. దీంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఈ చెట్టును తొలగించే పనులు చేపట్టారు. బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

అపరాల్లో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయ శాఖ అధికారులు

నక్కపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఉమాప్రసాద్

ప్రజాశక్తి -నక్కపల్లి:అపరాలు సాగులో సమగ్ర పంట యాజమాన్యం పాటించాలని వ్యవసాయ అధికార ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని కాగిత, వేంపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పర్యటనలో అపరాల పంటను పరిశీలించారు.రైతులకు అపరాలలో యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు.ఎకరాకు పసుపు రంగు జిగురు అట్టలు 10 నుంచి 15 వరకు పొలంలో కట్టడం ద్వారా రసం పీల్చు పురుగుల ఉధృతిని తగ్గించవచ్చునన్నారు.తొలి 20 రోజుల లోపు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున వేప నూనె పిచికారి చేయడం ద్వారా చీడపీడలు పొలంలోకి రాకుండా కాపాడు కోవచ్చునని, 15 నుంచి 20 మధ్యలో కలుపు రెండు నుంచి మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపిర్ మందు ఎకరాకు 200 మిల్లీ లీటర్లు పిచికారి చేయడం ద్వారా అన్ని రకాల కలుపు మొక్కలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఈ సమయంలో నేలలో కొద్దిగా తేమ ఉండాలన్నారు. ఆకుముడత పురుగు లేదా పూత పురుగు ఆశించినప్పుడు ఎసిఫేట్ పొడి మందు ఎకరాకు 300 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ మందు 360 ఎం ఎల్ పిచికారి చేయాలని,పురుగు ఉధతి ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంట్రినిలిప్రోల్ లేదా ఫ్లూబెండమైడ్ ఎకరాకి 60 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారి చేయాలని సూచించారు.బూడిద తెగులు లేదా తుప్పుతెగులు ఆశించినపుడు లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున మాంకోజెబ్ లేదా 2 మిల్లీలీటర్ల చొప్పున హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట చివరి దశలో నీటి ఎద్దడి గమనించినట్లయితే ఎకరాకి ఒక కిలో పొటాషియం నైట్రేట్ (13-0-45) పిందె దశలో పిచికారి చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్, సన్యాసినాయుడు ,రైతులు పాల్గొన్నారు

దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ, మామిడిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రవీంద్ర మాట్లాడుతూ మినుము పంటలో బూడిద తెగులు నివారణకు మైక్రో బొటానిల్ ఒక గ్రాము ఒక లీటర్ నీటికి లేదా, డైనోకాప్, పెన్కోడ్ ముందును పిచికారి చేయాలని సూచించారు. రబీ సీజన్‌లో వేసే నువ్వులు, వేరుశెనగ తదితర పంటల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎల్వై.కాంతమ్మ, ఏఈఓ కిరణ్ కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ

బాధ్యతగా విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:బాధ్యతగా విధులు నిర్వహిం చాలని ఎంపీడీవో డి సీతారామరాజు ఆదేశించారు. మండలంలోని ఉపమాక సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఎంఎస్ఎంఈ సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. మిస్సింగ్ సిటిజన్స్, ఈ సర్వీసెస్ పేమెంట్, పీఎం ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్య పరమైన సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, తాతారావు, కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సీహెచ్. నాగాపురం పంచాయతీ శివారు కుమారపురం గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొలగాన రామారావు, సీనియర్ నాయకులు పోలిశెట్టి జగ్గయ్య, బొప్పన ప్రసాద్ పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కలం నాగేశ్వరరావు, నాయకులు సేనాపతి వరహాలబాబు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండలంలోని దోసలపాడు, చినదొడ్డిగల్లు గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించారు. ఆధార్ క్యాంపులను ఎంపీడీవో సందర్శించారు. 0 నుండి 6 సంవత్సరాల లోపు బాల బాలికలకు స్పెషల్ ఆధార్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. సిబ్బంది చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉదండపురం గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.పలు రాజకీయ పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలో తీర్థం జరిగింది. కోలాట ప్రదర్శనలు, తప్పుడు గుళ్ళ కళాకారుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి.

విజేతలుగా నిలిచిన మూడు దూడలు

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో గొట్టివాడ అగ్రహారం గ్రామంలో మంగళవారం లేగ దూడల ప్రదర్శనను మాడుగుల ఏరియా పశు వైద్యాధికారి వేగి చిట్టినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. గొట్టివాడ అగ్రహారం, చింతలూరు, వీరనారాయణం గ్రామాల పాడి రైతులు పలు రకాల లేగ దూడలను ప్రదర్శనకు తీసుకుని వచ్చారు. పాడేరు డివిజన్ ఉప సంచాలకులు సి.హెచ్. నరసింహులు వీటిని పరిశీలించారు. ఉత్తమంగా నిలిచిన పెయ్యలకు బహుమతులను సర్పంచ్ నందారపు మంగమ్మ పానాపతి, ఎం. పి.టి.సి ఆర్లి మాధవి నాయుడు, వీరనారాయణం సర్పంచ్ ఎల్లపు కొండ అప్పారావు, గొట్టివాడ అగ్రహారం కూటమి నాయకులు మువ్వల గంగు నాయుడు, ఆర్లి అంజిబాబులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు మణి లక్ష్మణ్, గణేష్ , సౌజన్య, పశు వైద్య సహాయకులు మోది నాయుడు, శివ, శ్రీను, కన్నం నాయుడు, గోవింద్, రాము పాల్గొన్నారు.

పెన్షన్ల వెరిఫికేషన్ చేయాలి

ప్రజాశక్తి రావికమతం:దివ్యాంగుల మెడికల్ పెన్షన్ వెరిఫికేషన్ జిల్లా కేంద్రంలో కాకుండా మండల కేంద్రంలో నిర్వహించాలని చోడవరం నియోజక వర్గ వికలాంగుల హక్కుల పోరాట సమితి కన్వీనర్ గంజి శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రూ.6వేలు పింఛను పొందుతున్న వికలాంగులు మెడికల్ పెన్షన్ వెరిఫికేషన్ నిమిత్తం జిల్లా కేంద్రం వైద్య కార్యాలయానికి వెళ్లాలంటే చాలా కష్టంతో కూడుకుందన్నారు. అధికారులు మానవతా దృక్పథంతో వికలాంగుల సమస్యలను అర్థం చేసుకోవాలన్నారు. రహదారులు లేని మారుమూల ప్రాంతాలు నుంచి జిల్లా కేంద్రానికి రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లలేని వారిని అనర్హులుగా గుర్తించడం, వెళ్లిన వాళ్లను అర్హులుగా గుర్తించడంతో నిజమైన అర్హులు కూడా పెన్షన్ కోల్పోయే పరిస్థితి ఉంటుందన్నారు. దివ్యాంగుల సమస్యలపై స్థానిక ఎంపీడీవో వెంకన్న బాబు, జిల్లా కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోదీ నాయుడు, ఎంపీటీసీ నాగేశ్వరావు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నేతలు

మాట్లాడుతున్న ఎస్ఐ

వేధింపులు అరికట్టడంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు మాట్లాడుతూ..పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపులకు ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీల ద్వారా ఏ విధంగా అరికట్టాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మేరీరోజ్, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

అధికారుల పని తీరుపై నిలదీత

-సమస్యలపై పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు
-మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల అసహనం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-మాడుగుల: సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాజారాం అధ్యక్షతన మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. ధాన్యం డబ్బులు పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లో జమ కాలేదని ప్రజాప్రతినిధులు తెలిపారు.రెవెన్యూ శాఖలో సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రతిసారి కార్యాలయాల చుట్టూ తిరగాలంటే ఇబ్బందికరమైన పరిస్థితులు నెల కొంటున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఎన్నిమార్లు సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.పలు గ్రామాల్లో విద్యుత్కు అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నామని సభ దృష్టికి తీసుకువెళ్లారు. పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు నిలదీశారు.

అనంతరం బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, వైద్యాధికారులు గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ పెట్టుబడులు తక్కువగా పెట్టి ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా రైతులకు సలహాలు సూచనలు అందించాలని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన భూములపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. లేకుంటే అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలను ఒకటికి పది సార్లు కార్యాలయాల చుట్టూ తిప్పించరాదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కే.రమాదేవి, సర్పంచ్ ఎడ్ల కళావతి, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేపలవేటలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఫిషింగ్ హార్బర్‌లో ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెకనైజ్డ్, మోటరైజ్డ్, సంప్రదాయ ఫిషింగ్ బోట్ల యజమానులకు రాష్ట్ర మత్స్యశాఖ, కేంద్ర మత్స్య పరిశోధన సంస్థలు, మెరైన్ పోలీస్, ఇండియన్ కోస్ట్ గార్డ్, అటవీ శాఖ, జివిఎంసి అధికారులు సంయుక్తంగా అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సముద్ర తాబేళ్ళ సంరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ఎంపెడా డి.డి ప్రసాద్ నాయక్, నెట్ ఫిష్ స్టేట్ కో ఆర్డినేటర్ హనుమంతరావు మాట్లాడుతూ, సిఐఎఫ్ టి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ చేపలవేట చేసే వలల నుండి తాబేళ్లు సురక్షితంగా తప్పించుకొనుటకు వలలలో టెడ్ పరికరాన్ని అమర్చి వేట చేయాలని సూచించారు. కొత్తగా సిఐఎఫ్ టి శాస్త్ర వేత్తలు తయారు చేసిన టెడ్ పరికరం ప్రదర్శించి అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, లైట్ ఫిషింగ్" చేయడంతో సముద్ర ఆవరణ వ్యవస్థ, చేపల ప్రవర్తనలో మార్పులు కలిగి మత్స్య సంపద తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. లైట్స్ వినియోగించి చేపల వేట నిలుపుదల చేయాలని చెప్పారు.ఎస్ఎస్ఐ జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి మాట్లాడుతూ, విశాఖ తీరంలో గోస్ట్ ఫిషింగ్ హాట్ స్పాట్స్, ప్లాస్టిక్ వ్యర్థాలతో తాబేళ్ళు, మత్స్యసంపద పై కలుగు దుష్పరిణామాలు గూర్చి వివరించారు. మెరైన్ ఎస్ఐ మురళీ కృష్ణ, ఇండియన్ కోస్ట్ గార్డు ప్రధాన అధికారి మహేశ్ కుమార్ మాట్లాడుతూ, మత్స్యకారుల రక్షణ, బోట్లు రిజిస్ట్రేషన్,లైసెన్సుపై వివరించారు.అనుమానిత బోట్లు, వ్యక్తులు సముద్రంలో సంచరిస్తే తీర రక్షకదళం, మత్స్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

హాజరైన అధికారులు, శాస్త్రవేత్తలు

మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణ రావు మాట్లాడుతూ,కలెక్టర్ ఆదేశాల ప్రకారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని, తెగిన వలలు, తాళ్ళు, ప్లాస్టిక్ వ్యర్థాలు బోటులో డస్ట్ బిన్ లో వేసి ఒడ్డుకు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెఖనైజ్డ్ బోటు యజమానుల సంఘ ప్రతినిధులు ఎం.లక్ష్మణ రావు, సి.హెచ్.వీర్రాజు, కొండబాబు, ఎస్.నర్సింగ రావు,ఎం.బాలాజీ, రాము,చిన్న, మత్స్యశాఖ ఎడి విజయకృష్ణ ,మత్స్య సహాయకులు,శాస్త్రవేత్త ప్రసాద్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషా జ్యోతి, మురళి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై కార్యాచరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారంకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రెండో రోజైన మంగళవారం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఎన్ జివో హెూం లో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు,ఇళ్లు,అక్రిడేషన్ల సదుపాయం కల్పించాలన్నారు. ప్రమాద భీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు.విశాఖ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం నియమించిన అన్ని కమిటీల్లోనూ ప్రభుత్వం పాత్రికేయులకు ప్రాతినిద్యం కల్పించాలన్నారు.సభ్యత్వ నమోదు కార్యక్రమం 15 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, కృష్ణారావు పాల్గొన్నారు.

24న ప్రత్యేక మేళా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని తపాలా శాఖ కార్యాలయాలలో సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరుచుటకు ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నామని ఎంపీపీ కాలనీలోని తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా తెలిపారు. ఈ మేళా ద్వారా ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఖాతాలు తెరిచి ప్రయోజనం పొందాలన్నారు. ఈ పథకం ద్వారా ఆడపిల్లల తల్లిదండ్రులు తమ పదేళ్ల లోపు వయసుగల కుమార్తెల పేరిట ఖాతాలు తెరవచ్చునని, ఈ ఖాతాలలో సంవత్సరానికి రూ.250 నుండి రూ.1,50,000 వరకు జమ చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఖాతాలలో జమ చేసిన డబ్బుకు ఇతర పథకాల కన్నా ఎక్కువ వడ్డీ లభిస్తుందని ఆయన తెలిపారు. ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగం పేట గ్రామంలో నర్సీపట్నం- కృష్ణదేవిపేట మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణలకు గురికాకుండా మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఆక్రమణలు ఎక్కువగా ఉన్న కారణంగా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఈ స్థలంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ఆక్రమణలకు ప్రయత్నిస్తే అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్అండ్‌బి అధికారులు హెచ్చరించారు.

ఏర్పాటు చేసిన బోర్డు

టూరిజం రిసార్ట్స్ సందర్శన

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయలోని పర్యాటక శాఖ పున్నమి వ్యాలీ రిసార్ట్స్, హరిత రిసార్ట్స్, అమీబా కాటేజ్ లను రాష్ట్ర పర్యాటక శాఖ ఎండి, సీఈవో అమ్రపాలి మంగళవారం పరిశీలించారు. ముందుగా అనంతగిరి మండలంలో పర్యటించిన అనంతరం అరకులోయకు చేరుకొని ఇక్కడ జరుగుతున్న పనులు, రిసార్ట్స్ మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం పర్యాటకశాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఆమెతో మాట్లాడ్డానికి స్థానిక విలేకరులు ప్రయత్నించగా ఆమె నిరాకరించారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		